వివిధ కోర్సుల పరీక్షా
ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 21: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్) మొదటి సెమిస్టర్, మూడేళ్ల ఫార్మ్‌డీ, ఆరేళ్ల ఫార్మ్‌డీ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు. ఈ ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్ www.osm ania.ac.inలో చూసుకోవచ్చన్నారు.

బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును వచ్చే నెల 2లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుంతో 8 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు.

వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ (ఓడీఎల్) మూడు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 25 నుంచి, మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 3నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. దూరవిద్యాకేంద్రం ద్వారా అందించే పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డేటా సైన్స్ రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 25 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీ ల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

6 నుంచి సీపీజీఈటీ పరీక్షలు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల పరిధిలో అన్ని పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే సీపీజీఈటీ - 2024 పరీక్షల తేదీలను ఖరారు చేసినట్లు సీపీజీఈటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ. పాండురంగారెడ్డి తెలిపారు. సీపీజీఈటీని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 45 సబ్జెక్టులలో పరీక్షలను వచ్చే నెల 6 నుంచి 15 వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రోజూ మూడు సెషన్లలో ఈ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను వచ్చే నెల 3 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తామని వివరించారు. ఇతర వివరాలకు www.osmania.ac.in, www.cpget.tsche.ac.in, www.oua dmissions.com లో చూసుకోవచ్చని సూచించారు.

కల్యాణ లక్ష్మి
చెక్కులు పంపిణీ

పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు.శుక్రవారం మారేడ్‌పల్లి,సికింద్రాబాద్,తిరుమలగిరి మండలాల పరిధిలోని 152 లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు పాండు నాయక్,అశోక్ కుమార్,శివ కుమార్,స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.- మారేడ్‌పల్లి,జూన్ 21

ట్రాఫిక్ నిబంధనలపై ఆటోడ్రైవర్లకు అవగాహన

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 21: ఆటోడ్రైవర్లందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్, చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు సూచించారు. ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆలుగడ్డ బావి ప్రాంతంలో ఆటోడ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు కచ్చితంగా ఖాకీ చొక్కా వేసుకుని ఆటో నడిపించాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై శ్రీధర్ పాల్గొన్నారు.

రాష్ట్ర సాధనలో జయశంకర్ సార్ పాత్ర కీలకం

అడ్డగుట్ట/సికింద్రాబాద్/బన్సీలాల్‌పేట్/ బొల్లారం, జూన్ 21 : తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా బతికిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి కొనియాడారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని అడ్డగుట్టలోని కార్పొరేటర్ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి కార్పొరేటర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, సత్తయ్య గౌడ్, అమర్, వసంత, దాసరి శ్రీనివాస్, కైరం కొండ యాదగిరి, మహ్మద్, శ్రీను, అల్లా బక్షు, గౌస్, రాజు, వెంకటేష్, రజిని పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పద్మారావు క్యాంపు కార్యాలయంలో..

ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని సికింద్రాబాద్ బీఆర్ఎస్ నాయకులతో పాటు సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ పాల్గొని ఎమ్మెల్యే పద్మారావు క్యాంపు కార్యాలయంలో జయశంకర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై అవగాహన కల్పించడంలో జయశంకర్ కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు.ఆయన తుది శ్వాస విడిచే వరకు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మారావు వ్యక్తిగత సహాయకులు గోపాల్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బాలాజీ,నరేష్, పద్మ,అర్చన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బోయిగూడలో..

తెలంగాణ ఉద్యమానికి చేయూతనందించిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని బన్సీలాల్ పేట్ కార్పొరేటర్ కే.హేమలత అన్నారు. న్యూబోయిగూడలోని జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీహెచ్ఎంసీ జవాన్ జాన్ సుందర్, తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులు ఎస్.రాజేందర్, ఓ.రాజు, దేశపాకశ్రీను, నాగభూషణం, అరుణ్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, కుమార్‌యాదవ్, సాయికృష్ణ, సదానంద్, సత్యం, వెంకటేశ్,రాజు, నర్సింగ్‌రావులు పాల్గొన్నారు.

అడ్డగుట్టలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి తదితరులు

బోయిన్‌పల్లి జయనగర్ చౌరస్తాలో..

ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి వేడుకలు బోయిన్‌పల్లి,బొల్లారంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బోయిన్‌పల్లి జయ నగర్ చౌరస్తాలో మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో టింకు గౌడ్,ఓం ప్రకాష్ యాదవ్,అజయ్,శ్రీనివాస్,రత్నాకర్ యాదవ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లారంలో..

బొల్లారం డౌటన్ బజార్ చౌరస్తాలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సత్యనారాయణ గౌడ్,రావుల సతీష్, మురళి యాదవ్,నవీన్,శేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జయశంకర్ సార్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సామల

బోయిగూడలో జయశంకర్ సార్ విగ్రహానికి నివాళులర్పించిన కార్పొరేటర్ హేమలత, బీఆర్ఎస్ నాయకులు

బోయిన్‌పల్లిలో..

బొల్లారంలో..గజ్జెల నగేశ్, పార్టీ నాయకులు

నోట్ బుక్స్ పంపిణీ :కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు బొల్లారం రిసాల బజార్ ప్రభుత్వ పాఠశాలలో బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్ శుక్రవారం విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు.

పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రకాశ్‌నగర్‌లో కొనసాగుతున్న పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి తదితరులు

బేగంపేట్, జూన్ 21: బేగంపేట్ డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. బేగంపేట్ డివిజన్‌లోని ప్రకాష్‌నగర్‌లో ఏడు లక్షలతో చేపట్టిన పైపులైన్ నిర్మాణ పనులను శుక్రవారం జీహెచ్ఎంసీ డీఈ సంతోష్‌తో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహేశ్వరి మాట్లాడుతూ... వర్షాకాలం నేపథ్యంలో పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీహరి పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి
బాలల హక్కుల పరిరక్షణ వేదిక

అడ్డగుట్ట, జూన్ 21 : బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు అన్నారు. శుక్రవారం అడ్డగుట్ట బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో మారేడ్‌పల్లి మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలు పునః ప్రారంభమైనా మండల పరిధిలో బడికి దూరంగా ఇంకా 159 మంది పిల్లలు ఉన్నారన్నారు. వారిని బడిబాట పట్టించాల్సిన బాధ్యత పాఠశాలలపైనే ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందేవిధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌వీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఏవి ఎమ్ స్వామి, బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ, ప్రతినిధులు సత్తయ్య గౌడ్, పీఎల్ ప్రవీణ్, అజయ్‌బాబు, మల్లేష్, కాంపల్లి శ్రీనివాస్, రాజయ్య, వీరయ్య, జ్యోతి, ఎమ్‌వి ఫౌండేషన్ ఆర్గనైజర్లు ఎ.సువర్ణ, లావణ్య, భాగ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

యోగా జీవితంలో భాగం కావాలి

పాల్గొన్న కార్పొరేటర్లు , యువతీ యువకులు

బేగంపేట్/సికింద్రాబాద్/బన్సీలాల్‌పేట్/ఉస్మానియా యూనివర్సిటీ/అడ్డగుట్ట/ జూన్ 21: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం బేగంపేట్‌లోని మహిళా డిగ్రీ కళాశాలలో స్కూల్ ఆఫ్ యోగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆర్గనైజేషన్ సహకారంతో యోగా నిర్వహించారు. యోగా శిక్షకులు వనితా మలేవాల్,మాధవిలు యోగాసనాలు, ప్రాణయామాలు ధ్యానం నేర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె పద్మావతి యోగా వలన నిత్య జీవితంలో కలిగే ప్రయోజనాలను వివరించారు.

● నామాలగుండు పరిధిలో..

అంతర్జాతీయ యోగా వేడుకల్లో సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని నామాలగుండులో ఉన్న ఓ జిమ్‌లో కార్పొరేటర్ హేమ ముఖ్య అతిథిగా పాల్గొని యోగా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా శరీరాన్నా అనేక వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చన్నారు.

● ప్రతిరోజూ యోగా చేయాలి

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పద్మారావునగర్‌లోని జీహెచ్ఎంసీ పార్కులో యోగా సాధకులు తమ యోగా గురువులను ఘనంగా సన్మానించారు. జీవితంలో యోగా ఓ భాగం కావాలని, ప్రతిరోజూ శారీరక వ్యాయామం చేసి యోగాసనాలు వేయడం వలన మంచి ఆరోగ్యం, ఉల్లాసం కలుగుతుందని వారు అన్నారు.

● భారతీయ యోగా సంస్థాన్ పద్మారావునగర్ శాఖ ఆధ్వర్యంలో యోగా గురువులు శ్రావణ్‌కుమార్, అంజయ్యలు యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

● గాంధీ దవాఖాన మాతా శిశు సంరక్షణ భవనంలో కుటుంబ సంక్షేమ లెక్చరర్ డి.వెంకటరామనర్సయ్య ఆధ్వర్యంలో యోగా దినోత్సవం గురించి అవగాహన శిబిరం నిర్వహించారు.

● బోయిగూడలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

● సహాయ ప్రొఫెసర్ సుధ, లెక్చరర్ వాహినీల ఆధ్వర్యంలో నర్సంగ్ విద్యార్థులకు యోగా నేర్పించారు.

● ఉస్మానియా యూనివర్సిటీలో..

అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని ఉస్మానియా యూనివర్సిటీలోని సంస్కృత అకాడమీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అకాడమీలో యోగా శాస్త్రంపై ఒక రోజు వర్క్ షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ ప్రొఫెసర్ నీలకంఠం మాట్లాడుతూ మనిషికి కావాల్సిన శారీరకమైన, మానసికమైన స్వస్థత కోసం, ఆధ్యాత్మికతత్త్వం అవగతం చేసుకునేందుకు వేల ఏళ్ల క్రితం పంతజలి మహర్షి సంస్కృతంలో యోగదర్శనాన్ని రచించారని చెప్పారు. అనేక భాషల్లో ఈ గ్రంథం అనువదింపబడినప్పటికీ, సంస్కృతం నేర్చుకుని ఈ శాస్త్రం అభ్యసిస్తే పతంజలి వివరించిన తత్త్వం స్పష్టంగా అర్థం అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సభ్యులు డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ సూర్యప్రకాశ్, డాక్టర్ సంతోష్ జోషి, భరద్వాజ్, మంజీర, వీరభద్ర శర్మ, చంద్రశేఖర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

● ఆరోగ్యంగా ఉండాలంటే యోగా చేయాలి

యోగాతో సంపూర్ణమైన ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని వారాసిగూడలోని చిలకలగూడ ఏసీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఏసీపీ జైపాల్‌రెడ్డి, చిలకలగూడ సీఐ అనుదీప్, పోలీసులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు పలు ఆసనాలతో పాటు ధ్యానం చేయడం అనంతరం ఏసీపీ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేయాలని ఆయన సూచించారు.

బన్సీలాల్‌పేట: పద్మారావునగర్ పార్క్‌లో యోగా చేస్తున్న సాధకులు

బొల్లారం: బొల్లారం కంటోన్మెంట్ పార్కులో యోగా చేస్తున్న దృశ్యం

బేగంపేట్: బేగంపేట్ మహిళా డిగ్రీ కళాశాలలో..

యోగా చేస్తున్న సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ

గాంధీ నర్సింగ్ కళాశాలలో యోగా చేస్తున్న ప్రిన్సిపాల్ విద్యుల్లత, అధ్యాపకులు, విద్యార్థులు

అడ్డగుట్ట: యోగాసనాలు వేస్తున్న చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, సీఐ అనుదీప్, తదితరులు

ఒంటరి మహిళలకు
రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలి

అడ్డగుట్ట : హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌ను యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శుక్రవారం కలిసి మహిళలకు సంబంధించిన పలు డిమాండ్లను తెలియజేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అర్హులైన ఒంటరి మహిళలను గుర్తించి ఒక్కొక్కరికీ రూ.5వేల పెన్షన్‌ను అందించాలని, అదేవిధంగా గృహ హక్కులు, భూమి హక్కులను కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఒంటరి మహిళలందరికీ ఆరోగ్య కవరేజ్ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. అవే డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిస్ట్రిక్ వెల్ఫేర్ అధికారి అఖిలేశ్వర్ రావు కూడా అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ కీ షాన్ ఉస్మానియా దవాఖాన

ఎంఆర్ఐ, ఆధునికీకరించిన మెడికల్ ఓపీ, మోడ్రన్ కిచెన్‌ల ప్రారంభం

త్వరలోనే జీఎన్ఎం హాస్టల్ భవనాన్ని నిర్మిస్తాం: మంత్రి దామోదర రాజనర్సింహ

సుల్తాన్‌బజార్, జూన్ 21: ఉస్మానియా దవాఖాన హైదరాబాద్ షాన్ అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం ఉస్మానియా దవాఖానలోని కులీ కుతుబ్ షాహి భవనంలో రూ. 13.97 కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ, ఓపీ బ్లాక్‌లోని మొదటి అంతస్తులో రూ.55 లక్షలతో ఆధునీకరించిన మెడికల్ ఓపీ, ఏఆర్‌టీ సెంటర్లను, రూ. 2.16 కోట్లతో మోడ్రన్ కిచెన్‌లను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీలు ఎం.ఎస్. ప్రభాకర్‌రావు, సురభి వాణిదేవి, మీర్జా రహమత్ బేగ్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ శంకర్ యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1951లో నిర్మించిన జీఎన్ఎం నర్సింగ్ కాలేజీ హాస్టల్ శిథిలావస్థకు చేరడంతో నూతన హాస్టల్ భవనాన్ని నిర్మిస్తామన్నారు. త్వరలో హెల్త్ పాలసీపై కీలకమైన నిర్ణయం తీసుకోబోతున్నట్లు ఆయన వివరించారు. ఉస్మానియా దవాఖానకు నూతన భవనం విషయమై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తామన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి,రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రకుమార్, టీజీఎంఎస్ఐడీసీ చీఫ్ ఇంజినీర్ దేవేందర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చలపతి రావు, సూపరింటెండెంట్ ఇంజినీర్ డి. సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి

మహిళలు తాము ఎంచుకున్న రంగంలో రాణిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కార్పొరేటర్లు ముద్దం నర్సింహాయాదవ్, మహేశ్వరిలు ఆకాంక్షించారు. శుక్రవారం ఓల్డ్ బోయినపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన సుమన్ శాలీ సెంటర్‌ను కార్పొరేటర్లు ముద్దం నర్సింహాయాదవ్ కార్పొరేటర్ మహేశ్వరి,చీర సుచిత్ర, కొంతం దీపికలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సుమన్ సాలీ సెంటర్ నిర్వహకులు శ్రీశైలం, సుమలత పాల్గొన్నారు.
– బేగంపేట్

డబుల్ ఇండ్లను స్థానికులకే కేటాయించాలి

వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

సికింద్రాబాద్,జూన్21: సికింద్రాబాద్ నియోజకవర్గం లోని హమా లీ బస్తీలో ప్రభుత్వం నిర్మించిన 60 ఇండ్లను స్థానికులకు వెంటనే కేటాయించేందుకు కృషి చేయాలని గృహ నిర్మాణ పరిరక్షణ కమిటీ సభ్యులు లష్కర్ సాధన సమితి కమిటీకి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీలోని కమిటీ కార్యాలయంలో వారు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు అంజయ్య, రవి, నర్సింగ్ రావు లతో పాటు లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు బాలరాజ్ యాదవ్, మిట్టపల్లి బాబు రావు, జగదీశ్ గౌడ్, శైలేందర్, కృష్ణ ముదిరాజ్, అశోక్ చారి తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు ఇబ్బందులు
లేకుండా చర్యలు
కార్పొరేటర్ రాసూరి సునీత

అధికారులతో కలిసి బస్తీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ రాసూరి సునీతా రమేష్

అడ్డగుట్ట, జూన్ 21 : రానున్న బోనాల ఉత్సవాలను దృష్టిలో పెట్టుకొని ఆలయాల వద్ద మరమ్మతు పనులను చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత రమేష్ తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఆలయాల వద్ద నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... రానున్న బోనాల వేడుకల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎమ్‌సీ ఏఈ శశిధర్, జలమండలి అధికారి వరుణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉజ్జయినీ మహంకాళి
దేవాలయంలో చండీహోమం

బేగంపేట్: సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకొని చండీ హోమం నిర్వహిస్తున్నట్టు ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కామేశ్వర్, రామేశ్వర్, మాజీ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు. చండీ హోమం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.